ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



దుష్ప్రచారం ఆపండి
అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో సుబ్బారెడ్డి తదితరులు

- ఆస్కా సభ్యులకు అధ్యక్షుడు సుబ్బారెడ్డి వినతి
- ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణకు చర్యలు
- ఈజీఎం ప్రత్యేక తీర్మానం

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా) పట్ల కొంతమంది సభ్యులు గాడితప్పి దుష్ప్రచారం చేస్తున్నారని, ఇకనైనా ఇలాంటివి ఆపాలని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశమున్నా, సోదరభావంతో ఆ పనికి పూనుకోవడం లేదని, ఇప్పటికైనా వారు అలాంటి దుష్ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆయన కోరారు. 2019 జనవరి 27 తరువాత తొలిసారిగా గత ఆదివారం ఆస్కా అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) జరిగింది. డాక్టర్ సుబ్బారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి ఉపాధ్యక్షులు ఆర్.రవీంద్రన్, ఎస్.మునిరత్నం నాయుడు, కోశాధికారి కె.రంగారెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి డి.దేవేంద్రన్‌తో పాటు కమిటీ సభ్యులు, సంస్థ సభ్యులు హాజరయ్యారు. దీని గురించి సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 2019 జనవరి తరువాత సభ్యుల సమావేశం జరగడం ఇదే తొలిసారని, ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ఆమోదించామన్నారు. 2019 జనవరి 27 నుంచి ఈ నెల 27వ తేదీ వరకు 216 మంది సంస్థ సభ్యులు వివిధ కారణాలతో కన్నుమూశారని, ఇందుకు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయా సభ్యుల కుటుంబాలకు సంస్థ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈజీఎం కూడా సభ్యుల మృతికి సంతాపం ప్రకటించిందన్నారు.

లేనిపోని ఆరోపణలతో.. : 2017లో సంస్థ నూతన కమిటీ కోసం ఎన్నికలు జరగాల్సి వున్నప్పటికీ న్యాయస్థానాల్లో కేసుల వల్ల అది సాధ్యం కాలేదని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అయితే సంస్థ కార్యకలాపాలు ఎక్కడా కుంటుపడకుండా, వందలాదిమంది జీత భత్యాలు ఆగకుండా తాము చర్యలు చేపట్టామన్నారు. సంస్థకు చెందిన వారే కొంతమంది ఉద్దేశపూర్వకంగా సంస్థ లావాదేవీలను ఆపేందుకు ప్రయత్నించినా, తాము వాటిని సాగనివ్వలేదన్నారు. సుహృద్భావ వాతావరణంలో చర్చించుకుని సమస్యలను చక్కదిద్దుకోవాల్సిన కొంత మంది సభ్యులు.. లేనిపోని ఆరోపణలు చేస్తూ న్యాయస్థానాల్లో కేసులు వేశారన్నారు. ఆ తరువాత మళ్లీ 'చిల్డ్రన్స్ కోటా' అంశాన్ని తెరపైకి తెచ్చి ఎన్నికలను అడ్డుకున్నారన్నారు. నిజానికి హైకోర్టు నియమించిన కమిషన్ నేతృత్వంలో చిల్డ్రన్ కోటా అంశానికి పరిష్కారం కనుగొన్నామని, అయినా ఆ కోటా సభ్యులు ఎన్నికల్లో పోటీ చేశారన్న కారణం చూపుతూ మళ్లీ కోర్టుకెక్కి, 2019లో జరిగిన ఓట్ల లెక్కింపును అడ్డుకున్నారని తెలిపారు. ఇప్పటికీ ఆ బ్యాలెట్ బాక్సులు గోడౌన్‌లో పడివున్నాయన్నారు. ఆ తరువాత సంస్థ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన అడ్‌హాక్ కమిటీ తీరు పెద్ద వివాదాస్పదమైందని, సంస్థలో తీవ్ర గందరగోళం రేపిందన్నారు. దాంతో 2022లో ఆ అడ్‌హాక్ కమిటీని రద్దు చేశామని, అంతేగాక సంస్థ తరఫున కేసులకు ప్రాతినిధ్యం వహించేందుకు సుప్రీంకోర్టు తనకు అనుమతిచ్చిందన్నారు.

ఫిబ్రవరిలో ఎన్నికలు...

సుప్రీంకోర్టులో త్వరలోనే కేసులు కొలిక్కివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే సుదీర్ఘ కాలంగా పూర్తిస్థాయి కమిటీ లేకపోవడం, పలు నిర్వహణా పనులకు అంతరాయం కలుగుతుండడం పట్ల సంస్థ సభ్యులు తీవ్ర అసంతృప్తితో వున్నారని తెలిపారు. అందుకే సభ్యుల విన్నపం మేరకు అసాధారణ సమావేశం నిర్వహించామన్నారు. ఇందులో 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అకౌంట్స్‌కు ఆమోదం తెలపడంతో పాటు, తదుపరి కాలానికి అవసరమైన ఆడిటర్ల నియామక ప్రక్రియకూ ఆమోదం తెలిపామన్నారు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆమోదించామన్నారు. ఇందుకు న్యాయపరంగా ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధమని, తామూ బాధ్యత వహిస్తామని ఈజీఎంకు హాజరైన సభ్యులంతా స్పష్టం చేశారన్నారు. అయితే ఈ ఎన్నికల్లో చిల్డ్రన్స్ కోటా ద్వారా వచ్చిన సభ్యులకు ఓటుహక్కు ఉండదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు వారు సాధారణ సభ్యులుగా కొనసాగవచ్చని, కానీ ఓటు హక్కు మాత్రం ఉండదన్నారు. ఆస్కా విస్తరణలో భాగంగా ఈసీఆర్‌లో స్థలం గుర్తింపునకు అవసరమైన ప్రతిపాదన కూడా సమావేశం ఆమోదించిందన్నారు.

మంచి వేదిక ఇవ్వడం కోసమే నా తాపత్రయం..

కొవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సభ్యులపై ఎలాంటి అదనపు భారం పడకుండా సేవలందించడంతో పాటు సిబ్బందికి జీతాలిచ్చామని సుబ్బారెడ్డి వివరించారు. మున్ముందు తుఫానులు వచ్చినా ఆంధ్రా క్లబ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా శాశ్వత పరిష్కారం చూపామన్నారు. ఆంధ్రాక్లబ్‌లో భోజనమంటే ఎంతో ప్రసిద్ధి అని, అయితే గతంలో నెల కొన్న కొన్ని అనివార్య పరిణామాల వల్ల అది దెబ్బతిందన్నారు. కానీ ఇప్పుడు దానిని మళ్లీ చక్కదిద్దామన్నారు. లాభాలతో సంబంధం లేకుండా కేవలం రూ.140కే రుచికరమైన, నాణ్యమైన ఆంధ్రా భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఆహార విషయాలను స్వయంగా కమిటీయే పర్యవేక్షిస్తోందన్నారు. క్లబ్బులో ఇప్పుడెలాంటి సమస్యలు లేవని, ఈ నాలుగు నెలల్లో మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్నేళ్లపాటు సభ్యులు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తదుపరి వచ్చే కమిటీకి అన్ని మార్గాలు సానుకూలం చేసి, వారికి మంచి వేదికను అందించాలన్నది తన ఉద్దేశమని, అది తన కనీస బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడున్నా తాను ఆస్కాకు సేవలందిస్తూనే వుంటానని సుబ్బారెడ్డి వివరించారు.

త్వరలో విజయ్ రాష్ట్ర పర్యటన

- జయం మనదేనంటూ పార్టీ శ్రేణులకు లేఖ



చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి వద్ద నిర్వహించిన తొట్టతొలి మహానాడు విజయవంతం కావటంతో రెట్టింపు ఉత్సాహంతో తమిళగ వెట్రి కళగం నేత విజయ్ త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. మహానాడు విజయవంతమయ్యేందుకు కృషిచేసిన పార్టీ నేతలందరికీ ఆయన ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం ఓ లేఖ రాశారు. మాజీ ముఖ్యమంత్రి అన్నాదురైలా తాను పార్టీ శ్రేణులకు తరచూ లేఖలు రాసి వారిలో ఉత్సాహాన్ని నింపాలని నిర్ణయించుకున్నానని విజయ్ పేర్కొన్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం ఖాయమని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఇక దీపావళి తర్వాత 234 శాసనసభ నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటన జరిపేందుకు విజయ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతినియోజకవర్గంలో నాలుగైదు చోట్ల రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించారు. దీపావళి తర్వాత పార్టీ ప్రముఖులు, నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. విజయ్ ప్రస్తుతం హెచ్ వినోద్ దర్శకత్వంలో నటిస్తున్న 69వ చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. పదిరోజులపాటు ఆ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఆయన సినిమా షూటింగ్‌కు వెళ్ళనున్నారు. మే నెలాఖరువరకు ఆ సినిమా షూటింగ్ జరుగుతుందని తెలుస్తోంది. ఆ షూటింగ్ గ్యాప్‌లో ఆయన పార్టీ వ్యవహారాలపై దృష్టిసారించనున్నారు. సినిమా షూటింగ్ పూర్తికాగానే ఆయన పూర్తిగా రాజకీయాలకే అంకితమవుతారని అనుచరులు చెబుతున్నారు. ఓ వైపు డీఎంకేని, మరో వైపు జాతీయ పార్టీ బీజేపీపై మహానాడులో దుమెత్తిపోసిన విజయ్.. అన్నాడీఎంకేతో దోస్తీకడతారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆ దిశగానే రెండు పార్టీల నాయకులు రహస్యంగా మంతనాలు కూడా చేస్తున్నారని తెలుస్తోంది. మహానాడులో తమ పార్టీని విమర్శించకపోవడం వల్ల అన్నాడీఎంకే కూటమిలో విజయ్ పార్టీ చేరటం ఖాయమేనని డీఎంకే, దాని మిత్రపక్షాలు కూడా చెబుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికల సమయంలో పొత్తులపై దృష్టిసారించవచ్చునని, అంతకంటే ముందు రాష్ట్రప్రజలను నేరుగా కలుసుకోవాలని విజయ్ నిర్ణయించారు. ఆ దిశగానే దీపావళి తర్వాత ప్రధానంగా నియోజకవర్గాల వారీ పర్యటనపై దృష్టిసారించనున్నారు.

ఎన్నికల సమయంలోనే పొత్తులు

విజయ్ మమ్మల్ని విమర్శించలేదు ● అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నాటి పరిస్థితులకనుగుణంగా పొత్తులు, కూటములుంటాయని అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. తమ పాలన ప్రజారంజకంగా ఉండడం వల్లనే టీవీకే అధినేత విజయ్ తమపై ఎలాంటి విమర్శలు చేయలేదని స్పష్టం చేశారు. ఒక్కో పార్టీకి ఒక్కో సిద్ధాంతముంటుందని, అవి సరైనవా కావా అన్నది అప్పుడే చెప్పలేమని కూడా వివరించారు. రాయపేటలోని అన్నాడీఎంకే



నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్



అన్నాడీఎంకే కార్యాలయం వద్ద కార్యకర్తల సందడి

ప్రధాన కార్యాలయానికి ఈపీఎస్ రావడంతో ఆయనకు, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కళాశాలల్లో సహాయ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆ పోస్టులు సత్వరం భర్తీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని పార్కులను ప్రైవేటీకరణ చేయనున్నారనే వార్తలొస్తున్నాయని, ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సత్వరం ఉపసంహరించుకోవాలని సూచించారు. విజయ్ నిర్వహించిన మహానాడులో యువత అధికంగా పాల్గొందన్నారు. ఈ మహానాడులో విజయ్ తన పార్టీ సిద్ధాంతాలను ప్రకటించడంతో పాటు అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామన్నారని తెలిపారు. ఆ మహానాడులో పురచ్చి తలైవర్ ఎంజీఆర్ పేరును విజయ్ ప్రస్తావించారని, రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ అయినా ఎంజీఆర్, జయలలిత పేర్లను ప్రస్తావిస్తారన్నారు. విజయ్ పార్టీతో అన్నాడీఎంకే ఓట్లు చీలుతాయంటున్నారని, ఈ వార్తల్లో నిజం లేదన్నారు. అలాగే తాను ముఖ్యమంత్రి నని, విజయ్ ఉప ముఖ్యమంత్రి అంటూ వస్తున్న వార్తలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. విజయ్ ఇప్పుడే పార్టీ ప్రారంభించారని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఒక టిన్నరేళ్ల సమయం ఉందన్నారు. ఎన్నికల పరిస్థితులకు అనుకూలంగా కూటమిపై నిర్ణయం తీసుకుంటామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బలమైన కూటమి ఏర్పాటై, ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించి అధికారం కైవసం చేసుకుంటుందని పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త గృహసముదాయాలకు ప్రారంభోత్సవం, సీఎండీఏ పథకాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఆరు జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

రూ.426 కోట్లతో 108 గృహసముదాయాలు ● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెన్నై సహా ఆరు జిల్లాల్లో రూ.426.32 కోట్లతో నిర్మించిన 108 గృహసముదాయాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో చెన్నైలోని కుప్పైమేడు ప్రాజెక్టు కింద, దిగువ దళం, ఏడు అంతస్థులతో రూ.85.73 కోట్లతో నిర్మించిన 500 కొత్త క్వార్టర్స్, సత్యవాణి ముత్తునగర్ ప్రాజెక్టు కింద రూ.73.40 కోట్లతో నిర్మించిన 438 నివాసాలు, దోబిఖానా ప్రాజెక్టు కింద రూ.31.76 కోట్లతో నిర్మించిన 272 నివాసగృహాలు, చంద్ర యోగి సమాధి ప్రాజెక్టు కింద రూ.38.92 కోట్లతో నిర్మించిన 240 నివాసాలు, రాధాకృష్ణాపురం ప్రాజెక్టు కింద రూ.25.80 కోట్లతో నిర్మించిన 168 నివాసగృహాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా ఈరోడ్ జిల్లా కుల్లంగాడు వద్ద రూ.37.44కోట్లతో 416 నివాసాలు, అక్కరైకొడివేరి వద్ద రూ.21.81 కోట్లతో 256 గృహాలు, కన్నియాకుమారి జిల్లా కుమరాపురంలో రూ.30.57 కోట్లతో నిర్మించిన 288 గృహాలు, కోవై జిల్లా సీఎంసీ కాలనీ-2 ప్రాజెక్టు కింద రూ.25.25 కోట్లతో 222 గృహాలు, వెరైటీహాలు రోడ్డు వద్ద రూ.24.15 కోట్లతో 192 నివాసాలు, తంజావూరు జిల్లా వలయాన్‌వయల్ వద్ద రూ.19.02 కోట్లతో 168 నివాసాలు, తిరుచ్చి జిల్లా డాక్టర్ జేజే నగర్ ప్రాంతంలో రూ.12.47 కోట్లతో 108 నివాసగృహాలను కూడా సీఎం స్టాలిన్ ప్రారంభించారు.

సీఎండీఏ పథకాలకు శంకుస్థాపన..

చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో చెన్నై పెరుంబాక్కం, ముడిచ్చూరు, అయనంబాక్కం, వేళచ్చేరి, సీక్కనాన్ చెరువుకట్టల మరమ్మతు, వేళచ్చేరి ఫ్లైఓవర్ వద్ద మినీ పార్కు నిర్మాణం తదితర పథకాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ ఆరు పథకాలకు రూ.98.21 కోట్ల మేరకు నిధులు విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. పెరుంబాక్కం చెరువు ప్రాంతాన్ని రూ.23.65 కోట్లవ్యయంతో నీటి సరస్సులు, పక్షుల నిఘా గోపురం తదితర సదుపాయాలతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

రూ.156కోట్లతో విద్యాశాఖ భవనాలు..

సచివాలయంలో ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ తరపున రూ.156 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త భవనాలకు కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియోకాన్స్ ద్వారా ప్రారంభించారు. కళ్ళకురిచ్చి జిల్లా రిషివందియం, కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోవిల్. చెన్నై తరమణిలో, తిరునల్వేలి, బర్గూరు, వేలూరు, బోడినాయకనూరు, కారైక్కుడి తదితర ప్రాంతాల్లో నిర్మించిన భవనాలు, ఇండోర్ స్పోర్ట్ స్టేడియంలను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్ బాబు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, కేఆర్ పెరియకరుప్పన్, కోవి చెళియన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్. మురుగానందం, గృహవసతి నగరాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే విజయకార్తికేయన్, ఉన్నతవిద్యాశాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే గోపాల్, సాంకేతిక విద్య కమిషనర్ డి. అబ్రహామ్, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ. సుందరవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌కు షాక్

- మళ్లీ విచారణకు

రూ.1.77 కోట్ల అక్రమాస్తుల కేసు

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంపై నమోదైన అక్రమాస్తుల కేసు మళ్లీ విచారించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. 2001 నుంచి 2006 వవరకు అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన పన్నీర్‌సెల్వం, ఆదాయానికి మించి రూ.1.77 కోట్ల ఆస్తులు కూడబెట్టారంటూ డీఎంకే ప్రభుత్వంలో కేసు నమోదైంది. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులతో ఈ కేసు విచారణ మదురై జిల్లా కోర్టు నుంచి శివగంగ జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. అనంతరం అధికారం బదిలీ జరిగి అన్నాడీఎంకే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడడంతో, పన్నీర్‌సెల్వం, ఆయన కుటుంబ సభ్యులను ఈ కేసు నుంచి విడుదల చేస్తూ 2012లో శివగంగ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసును మళ్లీ విచారించేలా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ సుమోటాగా స్వీకరించి విచారించారు. ఈ కేసు విచారణకు స్టే విధించాలని కోరుతూ పన్నీర్‌సెల్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ తోసివేతకు గురైంది. ఈ నేపథ్యంలో, ఒ.పన్నీర్‌సెల్వంపై ఉన్న కేసును మళ్లీ విచారించాలంటూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల్లో.. కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తే జామీనును మదురై ప్రత్యేక కోర్టు రద్దు చేయవచ్చని, కేసుకు సంబంధించిన దస్తావేజులు మదురై ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు నవంబరు 27వ తేదిలోపు బదిలీ చేయాలని, రోజు వారీ విచారణ చేపట్టి 2025 జూలై నెలలోపు మదురై ప్రత్యేక కోర్టు ముగించాలని పేర్కొన్నారు. ఈ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న పన్నీర్‌సెల్వం సతీమణి సహా ఇద్దరు మృతిచెందడంతో వారిపై ఉన్న కేసులు ఉపసంహరించుకున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

త్యాగరాయర్, అమ్మ హాళ్లు
ప్రైవేటు పరం

జీసీసీ సమావేశంలో తీర్మానం



కౌన్సిల్ సమావేశంలో మేయర్ ప్రియ, ఉప మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన త్యాగరాయర్ నగర్(టి.నగర్)లోని సర్ పిట్టి త్యాగరాయ హాలు, షెనాయ్ నగర్‌లోని అమ్మ హాలును ప్రైవేటు సంస్థలకు లీజుకివ్వాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ఐదేళ్ల నుంచి ఈ హాళ్ల ద్వారా ఆదాయం తగ్గిపోవడంతో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్పొరేషన్ పేర్కొంది. మేయర్ ప్రియ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో 79 తీర్మానాలు ఆమోదించారు. వాటిలో ప్రధానంగా, నగరంలోని కృత్రిమ గడ్డితో కూడిన ఫుట్‌బాల్ మైదానాన్ని ప్రైవేటుకు అప్పగించాలని, గంటకు ఒక వ్యక్తి నుంచి రూ.120 ఫీజు వసూలుచేయాలని, సంస్థ ఎంపికకు త్వరలో టెండర్లు ఆహ్వానించాలని తీర్మానించారు. వడపళని మురుగన్ ఆలయం, షెనాయ్ నగర్ తదితర ప్రాంతాల్లో గోశాలలు నిర్మించాలని తీర్మానించారు. అలాగే, జీసీసీ పరిధిలోని 596 పార్కుల పర్యవేక్షణ ప్రైవేటు సంస్థలకు అప్పగించాలి సహా పలు తీర్మానాలు ఆమోదించారు. కాగా, సర్ పిట్టి త్యాగరాయ హాలు, అమ్మ హాలు ప్రైవేటుకు అప్పగించే నిర్ణయాన్ని ప్రతిపక్ష అన్నాడీఎంకే తీవ్రంగా విమర్శించింది. ఈ విషయమై ఆ పార్టీ కౌన్సిల్ కమిటీ కార్యదర్శి కార్తీక్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ రెండు హాళ్లు సామాన్య ప్రజలు వినియోగించేందుకు అనువుగా అత్యాధునిక వసతులతో రూపొందించారని, వాటిని ప్రైవేటుపరం చేయడంలో భారీగా అద్దె పెంచుతారని, సామాన్యులు వాటి దరిదాపుల్లోకి వెళ్లే అవకాశముండదని తెలిపారు. అలాగే క్రీడా మైదానం కూడా ప్రైవేటు కు అప్పగిస్తే, నగదు చెల్లిస్తేనే విద్యార్థులు మైదానం ఉపయోగించుకొనే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలు చేపట్టిన అధికార డీఎంకేకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కార్తీక్ పేర్కొన్నారు. సమావేశంలో ఉప మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమారగురుబరన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యాసంస్థలకు 'హాఫ్ డే లీవ్'

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు బుధవారం ఒక పూట మాత్రమే పనిచేయనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా, కొత్త దుస్తుల కొనుగోలుకు కుటుంబాలతో వెళ్లేందుకు వీలుగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యా సంస్థలు పనిచేస్తాయని ప్రభుత్వం తెలిపింది. కాగా, దీపావళి మరుసటిరోజైన నవంబరు 1వ తేది కూడా సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.745 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు నాబార్డ్ సహాయంతో రూ.745 కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుమతి విడుదల చేసిన ప్రకటనలో... ఉన్నత, మహోన్నత పాఠశాల్లో సైన్స్ ల్యాబ్, టాయిలెట్లు, ప్రహరీ గోడ, ల్యాబ్‌లో ప్రయోగాలకు అవసరమైన ఉపకరణాలు. తాగునీటి వసతి తదితరాలు కల్పించనున్నామన్నారు. ఈ వసతుల ఏర్పాటుకు నాబార్డ్ 85 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం నిధులు కేటాయించనున్నట్లు మధుమతి తెలిపారు.

మెట్రో ఉద్యోగులకు దీపావళి బోనస్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఉద్యోగులకు తొలిసారి దీపావళి బోనస్ ప్రకటించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఈ క్రమంలో సీఎంఆర్ఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా దీపావళి బోనస్ ప్రకటించాలని సీఐటీయూ చెన్నై మెట్రో రైలు కార్మిక సంఘం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో, సీఎంఆర్ఎల్‌లో పనిచేస్తున్నా 'నాన్ ఎగ్జిక్యూటివ్' ఉద్యోగులకు రూ.15,000 బోనస్‌ను సీఎంఆర్ఎల్ ప్రకటించింది.

రవాణా శాఖ కార్మికుల ఖాతాల్లో బోనస్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సహా పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సి, డి ఉద్యోగులకు సీఎం స్టాలిన్ 20 శాతం దీపావళి బోనస్ ప్రకటించారు. ఆ ప్రకారం, రవాణా శాఖ కార్మికులకు దీపావళి బోనస్ వారి బ్యాంక్ ఖాతాల్లో మంగళవారం జమ అయింది. సోమవారం రాత్రి బ్యాంకులకు జాబితా పంపించగా, సోమవారం ఉదయం కార్మికుల ఖాతాల్లో జమ అయ్యాయని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

తేయాకు కార్మికులకు 20 శాతం బోనస్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు టీ ఎస్టేట్ అసోసియేషన్ కార్మికులకు 20 శాతం దీపావళి బోనస్ అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. తేయాకు కార్మికులకు దీపావళి బోనస్ ఇవ్వాలని నీలగిరి జిల్లాలో ఆందోళనలు చేపడుతుండగా, విపక్షాలు కూడా వారికి మద్దతుగా నిలిచి బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అటవీ శాఖ నిర్వహణలోని అన్ని సంస్థల ఉద్యోగులకు 20 శాతం దీపావళి బోనస్ అందజేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్, రూ.5.72 కోట్లు కేటాయించారని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

నాలుగు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ ద్వారా రైతుల నుంచి వినియోగదారుల వాణిజ్యసంస్థ ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది వరి కొనుగోలు సీజన్ సెప్టెంబరు 1వ తేది ప్రారంభమైంది. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు 1,020 కేంద్రాలు ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ఆదివారం వరకు 4.02 లక్షల టన్నుల వరి కొనుగోలు చేసి, 56,283 మంది రైతులకు రూ.927 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

'పాదాలను రక్షిద్దాం' ప్రాజెక్ట్‌కు రూ.27 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మధుమేహంతో ఏర్పడే పాదాల సమస్యలను ప్రారంభ దశలోనే అడ్డుకొనేందుకు అమలుచేసిన పైలెట్ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించింది. 'మక్కల్ తేడి మరుత్తువం' పథకంలో 36 ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల్లో ఈప్రాజెక్ట్ అమలులోఉంది. 2,336 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 299 ప్రభుత్వాస్పత్రుల్లో పాదాల సమస్యలు తెలుసుకొనేలా ప్రత్యేక కేంద్రాలు, 100 ఆసుపత్రుల్లో పాదాల శస్త్రచికిత్సా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

నేటితో ఐటీఐలో అడ్మిషన్లు ఆఖరు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీఐల్లో చేరేందుకు బుధవారం చివరి రోజు అని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన, శిక్షణా శాఖ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని 102 ప్రభుత్వ, 311 ప్రైవేటు ఐటీఐల్లో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు సెప్టెంబరు 30తో ముగిశాయి. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అడ్మిషన్ గడువు ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. ఈ కోర్సులకు ఎలాంటి విద్యా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యార్థులు తమ సమీపంలోని ఐటీఐ కేంద్రానికి వెళ్లి అడ్మిషన్ పొందవచ్చని, వివరాలకు 9499055 689నెంబరులో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 6.27 కోట్ల మంది ఓటర్లు

నగరంలో 39.52 లక్షల మంది ● ముసాయిదా ఓటరు జాబితా విడుదల



ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న జిల్లా అదనపు ఎన్నికల నిర్వహణాధికారి ఎం.ప్రుథ్వీరాజ్

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	హిజ్రాలు	మొత్తం ఓటర్లు
ఆర్కేనగర్	1,17,930	1,26,788	120	2,44,838
పెరంబూరు	1,41,346	1,46421	87	2,87,854
కొళత్తూరు	1,39,011	1,45,743	72	2,84,826
విల్లివాక్కం	1,17,827	1,22,564	62	2,40,453
తిరువికనగర్	1,06,203	1,12,445	70	2,18,718
ఎగ్మూరు	95,460	97,287	70	1,92,817
రాయపురం	94,888	99,264	72	1,94,224
హార్బర్	91,249	84,883	65	1,76,197
చేపాక్‌ట్రిప్లికేన్	1,15,280	1,19,445	63	2,34,788
థౌజెండ్ లైట్స్	1,15,155	1,20,588	110	2,35,853
అన్నానగర్	1,35,364	1,41,033	104	2,76,501
విరుగంబాక్కం	1,40,256	1,41,033	93	2,82,252
సైదాపేట	1,32,905	1,37,732	86	2,70,723
టి.నగర్	1,15,084	1,18,307	50	2,33,441
మైలాపూరు	1,28,912	1,37,142	47	2,66,101
వేళచ్చేరి	1,54,401	1,58,430	81	3,12,912

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఓటర్ల జాబితా సవరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే యేడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 యేళ్లు పూర్తి చేసుకునేవారికి ఈ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసే కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు చర్యలు చేపడుతోంది. ఆ దిశగా మంగళవారం రాష్ట్రానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం రాష్ట్రంలో 6,27,30,588 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,07,90,791 మంది పురుషులు కాగా, 3,19,30,833 మహిళలు. 8964 మంది హిజ్రాలు కూడా ఉన్నారు. నగర పరిధిలోని చోళింగనల్లూరు నియోజకవర్గం 6,76,133 మంది ఓటర్లతో రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉంది. ఆ నియోజకవర్గంలో 3,38,183 మంది పురుషులు, 3,37,825 మంది మహిళలున్నారు. రాష్ట్రస్థాయిలో తక్కువ సంఖ్యలో ఓటర్లున్న నియోజకవర్గంగా నాగపట్టినం జిల్లా కీళ్‌వేలూరు 1,73,230 మంది ఓటర్లను కలిగి ఉంది.

చెన్నైలో 39,52,498 మంది ఓటర్లు...

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 39,52,498 మంది ఓటర్లున్నారని జిల్లా అదనపు ఎన్నికల నిర్వహణాధికారి ఎం. ప్రుథ్వీరాజ్ తెలిపారు. రిప్పన్‌భవనంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో 16 నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఆ మేరకు నగరంలో 19,41,271 మంది పురుషులు, 20,09,975 మంది మహిళలు ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ జాబితాలో 53,359 మంది కొత్తగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని, అదే విధంగా 26,005 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలను నగరంలోని 4, 5, 6,8, 9, 10, 13 జోనల్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలనకు ఉంచుతామన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపునకు సంబంధించి నవంబర్ 16, 17, 23, 24 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. నగరంలో వివిధ నియోజకవర్గాలలో ఓటర్ల సంఖ్య వివరాలను కూడా ఆయన విడుదల చేశారు.

విజయ్ రాజకీయాల్లోకి రావడమా !?

● నటి రాధిక

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం ఆశ్చర్యంగా ఉందని నటి రాధిక అభిప్రాయపడ్డారు. కోవై మక్కల్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో కోవైలోని గుజరాత్ సమాజంలో సోమవారం దీపావళి బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నటి రాధిక పాల్గొని 150 మంది బాలికలకు దీపావళి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ... టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు నా శుభాకాంక్షలు. సినీ రంగంలో స్టార్‌గా ఉన్న విజయ్ దానిని వదిలి రాజకీయాల్లో రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. సమత్తువ మక్కల్ కట్చి పార్టీ జెండాలోని రంగులనే విజయ్ తన పార్టీ జెండాలో వాడడం మంచి విషయం. విజయ్ తన సినిమాల్లోలాగే మహానాడు కూడా 'వన్ మ్యాన్ షో'గా చూపించాడని రాధిక వ్యాఖ్యానించారు.

ప్లీజ్... సెలవు తీసుకోవద్దు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సెలవు తీసుకోకుండా డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరుకావాలని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంటీసీ జనరల్ మేనేజర్ విడుదల చేసిన ప్రకటనలో.... ఈనెల 31న దీపావళి పండుగ సందర్భంగా, కొత్త దుస్తులు, బాణసంచా కొనుగోలు, స్వగ్రామాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. ప్రయాణికులు మెరుగైన సేవలందించేలా నవంబరు 3వ తేది వరకు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు సెలవు తీసుకోకుండా విధులకు హాజరుకావాలని, అదనపు పని గంటలు, అదనపు సర్వీసులు నడిపేందుకు కార్మికులు సహకరించాలని ఎంటీసీ విజ్ఞప్తి చేసింది.

పార్క్ స్టేషన్‌లో ఎమ్మార్టీఎస్ నో హాల్ట్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్ సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఎమ్మార్టీఎస్ రైళ్లు ఆగవని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య నాలుగో రైలు మార్గం చేపట్టనుండడంతో గత ఏడాది ఆగస్టు నుంచి చెన్నై బీచ్-వేళచ్చేరి-చెన్నై బీచ్ మధ్య నడిపే రైళ్లను చెన్నై బీచ్‌కు బదులుగా చింతాద్రిపేట వరకు మాత్రమే నడుపుతున్నారు. ఈ క్రమంలో, రైలు మార్గం పనులు తుది దశకు చేరుకోవడంతో ప్రయాణికుల విజ్ఞప్తితో మంగళవారం నుంచి చెన్నై బీచ్ నుంచే వేళచ్చేరికి ఎమ్మార్టీఎస్ రైళ్లను నడిపారు. ఈ నేపథ్యంలో, పార్క్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం, పై కప్పు నిర్మాణాలు జరుగుతుండడంతో చెన్నై పార్క్ రైల్వేస్టేషన్‌లో ఎమ్మార్టీఎస్ రైళ్లు నిలబడవని దక్షిణ రైల్వే తెలిపింది.

నాలుగు రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాం టిక్కెట్లు రద్దు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో, మంగళవారం నుంచే ప్రజలు స్వగ్రామాలకు బయల్దేరారు. బంధువులను రైలు ఎక్కించేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చే వారు రూ.10 ప్లాట్‌ఫాం టిక్కెట్టు కొనాల్సి ఉంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మంగళ, బుధవారాల్లో చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం, పెరంబూర్ రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాం టిక్కెట్ల విక్రయాలను రద్దుచేశారు. రైలు టిక్కెట్ ఉన్న వారిని మాత్రమే స్టేషన్ ప్రాంగణంలోకి అనుమతించనున్నారు. వృద్ధులతో వచ్చే వారు, అత్యవసర మందులు తీసుకెళ్లే వారికి మాత్రమే ప్లాట్ ఫాం టిక్కెట్లు విక్రయించనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

మూడేళ్లలో 36,647 గృహాల నిర్మాణం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం చేపట్టిన మూడేళ్ల కాలంలో 36,647 గృహాలతో కూడి సముదాయాలు నిర్మించారు. ఈ విషయమై చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి అన్బరసన్ సోమవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... నగరప్రాంత జీవనాధార అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో పలు పథకాల కింద 2021 మే నుంచి మూడేళ్ల కాలంలో 106 ప్రాంతాల్లో రూ.4,079 కోట్లతో 36,647 గృహాలతో కూడిన సముదాయాలు నిర్మించామన్నారు. ప్రస్తుతం ఆ గృహాలు పేదలకు కేటాయించే పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొరపాడి అరియూర్ తిరుమలైకోడి నారాయణి కల్యాణ మండపంలో మంగళవారం జిల్లాస్థాయి ఆటల పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని, పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ డా.బాలాజీ, ప్రాంత సెక్రటరీ అయ్యప్పన్, యూనియన్ సెక్రటరీ జ్ఞానశేఖరన్, మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయ్‌కు సిద్ధాంతాలపై స్పష్టత లేదు

● కేంద్రమంత్రి మురుగన్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రికళగం నాయకుడు, సినీ నటుడు విజయ్ పార్టీ తొలి మహానాడు అట్టహాసంగా నిర్వహించినప్పటికీ పార్టీ సిద్ధాంతాలను ప్రకటించడంలో పూర్తిగా విఫలమయ్యారని కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ విమర్శించారు. స్థానిక ఐసీఎఫ్ అంబేడ్కర్ అరంగంలో మంగళవారం జరిగిన సభలో చెన్నై పోస్టల్ శాఖలో 91 మందికి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో 13 మందికి, రైల్వేశాఖలో ఏడుగురికి, ఆర్థికశాఖ 36 మందికి, కేంద్ర భద్రతాదళంలో ఇద్దరికి చొప్పున ఆయన ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయ్ తన పార్టీతో పొత్తులు పెట్టుకుంటే అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని చెప్పి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు తెరలేపారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదకొండేళ్లుగా సంకీర్ణ ప్రభుత్వాన్నే నడుపుతోందన్నారు. ద్రావిడ సిద్ధాంతాలను ఆదర్శంగా చేసుకుంటామని చెప్పి విజయ్ సిద్ధాంతపరంగా వెనుకంజ వేసినట్లు తెలుస్తోందని, అదే సమయంలో బీజేపీని ఏదో విమర్శించాలన్న ఒత్తిడితో విమర్శలు చేశారే తప్ప ఘాటైన విమర్శలు చేయలేదనిమంత్రి మురుగన్ తెలిపారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి చిత్తుగా ఓడిపోవటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

లబ్ధిదారులకు దుస్తుల పంపిణీ



లబ్ధిదారులకు చీరలు, పంచెలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచిత చీరలు, పంచెలను మంత్రి దురైమురుగన్ అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, కో-ఆపరేటివ్ సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదొరై, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు సులోచన, యూనియన్ కమిటీ సభ్యుడు ప్రభు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుమతి, సేనూరు పంచాయతి అధ్యక్షులు శాంతమణి, ఉపాధ్యక్షులు మంజుల సంతానం పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దీపావళి కానుక



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి ఎస్సార్కే అప్పు

వేలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేలప్పాడి పూందోట్టం ప్రాంతంలో 47వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికులకు దీపావళి బహుమతులు అందజేశారు. వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు 150 మంది కార్మికులకు బహుమతులందించారు. కార్యక్రమంలో జిల్లా ఉప సెక్రటరీ సుకన్య దాస్, ప్రాంత సెక్రటరీ కుప్పుస్వామి, వేలూరు కార్పొరేషన్ ప్రతిపక్ష నేత, అమ్మ పేరవై జాయింట్ సెక్రటరీ ఎయిల్అరసన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాత్రి 12 గంటల వరకు మెట్రో సేవలు



చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం బుధవారం ఉదయం 5 నుంచి అర్థరాత్రి 12 గంటల వరకు మెట్రోరైళ్లు నడుపుతున్నట్లు సీఎంఆర్ఎల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, డా.ఎంజీఆర్ సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు గ్రీన్ మార్గంలో ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆరు నిమిషాలకు ఒక రైలు, బ్లూ మార్గంలో వింకోనగర్ నుంచి విమానాశ్రయం వరకు మూడు నిమిషాలకు ఒక రైలు నడపనున్నారు. అలాగే, ఉదయం 5 నుంచి 8 గంటలు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 5 గంటలు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు 7 నిముషాలకు ఒక రైలు నడపనున్నారు. ఇక, 31, నవంబరు 1వ తేదీలు ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఆదివారం టైంటేబుల్ ప్రకారం మెట్రోరైళ్లు నడుస్తాయని ప్రకటనలో తెలిపారు.



మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది సిద్ధం

పెరంబూర్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): టపాసులు కాల్చే సమయంలో ఏర్పడే అగ్నిప్రమాదాలను అడ్డుకొనేలా అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. దీపావళి పండుగను దేశ ప్రజలు గురువారం జరుపుకోనున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చుతుంటారు. కొన్ని సమయాల్లో టపాసులు పేలి గాయాలు కావడం, టపాసుల రవ్వలు సమీపంలోని ఇళ్లపై మంటలు చెలరేగడం సంభవిస్తుంటాయి. అదే సమయంలో పండుగ సందర్భంగా వాతావరణ కాలుష్యాన్ని అడ్డుకొనేలా ఉదయం 6 నుంచి 7 గంటలు, రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలో, టపాసుల కారణంగా ఏర్పడమే అగ్నిప్రమాదాలు అడ్డుకొనేలా రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక శాఖ సిద్ధమైంది. రద్దీ ప్రాంతాలు, గుడిసెలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది గస్తీ తిరుగుతారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100 (పోలీసు), 101 (అగ్నిమాపక శాఖ), 108 (అంబులెన్స్ సేవలు), 112 (సహాయ కేంద్రం) తదితరాలకు సమాచారం అందించాలని అగ్నిమాపక శాఖ విజ్ఞప్తి చేసింది.

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

వేళచ్చేరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అమలాక్‌చంద్ జైన్ హైయ్యర్ ప్రైమరీ, నర్సరీ పాఠశాలలు, పటాల్‌చంద్ సుగర్‌చంద్ కరోడియా పాఠశాలల వార్షికోత్సవం సోమవారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ దేశ పారిశ్రామికవేత్త దీప్‌చంద్ జి జైన్, గౌరవ అతిథులుగా చెన్నై బంగారం, వజ్రాల వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు జయంతిలాల్ జి సలాని, నర్సరీ పాఠశాలల కరస్పాండెంట్ బదల్‌చంద్ నాయర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1937లో ప్రారంభించి 87 ఏళ్లుగా విద్యార్థులకు మెరుగైన విద్య అందించి, వారిని ఉన్నతస్థాయిల్లో నిలిపిన విద్యా సంస్థల నిర్వాహకులను అతిథులు కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆగిన విండ్ రెక్కతో వెళ్తున్న లారీ



చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వెంగల్ గ్రామం వద్దనున్న కర్మాగారం నుంచి తూత్తుకుడికి 150 మీటర్ల పొడవైన విండ్‌మిల్లు రెక్కను తీసుకెళుతున్న ఓ లారీ రెడ్‌హిల్స్‌లో ఓ మలుపువద్ద ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు మూడు గంటలపాటు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి మరమ్మతుకు గురైన ఆ లారీని ఆ ప్రాంతం నుండి తొలగించారు. ఆ తర్వాత యధావిధిగా వాహనాల రాకపోకలకు ప్రారంభమయ్యాయి.

రూ.27 కోట్ల మాదకద్రవ్యాలు స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మూలకడై ప్రాంతంలో మంగళవారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో సుమారు 2.7 కిలోల మాదకద్రవ్యాలను శ్రీలంక తరలించేందుకు యత్నించిన విజయకుమార్, మణిమన్నన్‌లను అరెస్ట్ చేశారు. ఈ మాదకద్రవ్యాల విలువ రూ.27 కోట్లు ఉంటుందన్న పోలీసులు, వారిద్దరిని విచారిస్తున్నారు.

కందస్వామి ఆలయంలో రూ.6.36 కోట్లతో కల్యాణ మండపం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధానమైన తిరుపోరూర్ కందస్వామి ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అలాగే, ఈ ఆలయంలో వివాహాలు చేసుకొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. కానీ, ప్రస్తుతం ఆలయం తరపున చిన్న కల్యాణ మండపం ఉండడంతో ప్రైవేటు కల్యాణ మండపాల్లో వివాహాలు జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై దృష్టి సారించిన ఆలయ నిర్వాహకులు ఆలయ నిధులు రూ.6.36 కోట్లతో తిరుకళగుండ్రం రోడ్డు తండలం పంచాయతి ఏడయాన్‌కుప్పం ప్రాంతంలో ఆలయ స్థలంలో అత్యాధునిక వసతులతో కల్యాణ మండపం నిర్మించాలని నిర్ణయించింది. కల్యాణ మండపం, వధూవరులకు ప్రత్యేక గదులు, 10 విశ్రాంతి గదులు, పై అంతస్తులో డైనింగ్ హాల్, వంట గది, లిఫ్ట్ తదితరాలతో నిర్మాణపనులు ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

స్వగ్రామాలకు 2.5 లక్షల మంది

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను స్వగ్రామంలో జరుపుకొనేందుకు నగరం నుంచి రెండు రోజుల్లో సుమారు 2 లక్షల మందికి పైగా వెళ్లారు. ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబేడు, కిలంబాక్కం, మాధవరం ప్రాంతాల నుంచి పలు నగరాలకు సోమవారం 2,461 ప్రత్యేక బస్సులు నడపగా 1,10,475 మంది ప్రయాణించారు. అలాగే మంగళవారం నగరం నుంచి 2,092 బస్సులతో పాటు అదనంగా 2,125, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల నుంచి 1,130 బస్సులు నడుపగా సుమారు 1.5 లక్షల మంది ప్రయాణించారని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి లైంగిక వేధింపులు

● మహిళా హెచ్‌ఎం అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడిన మహిళా ప్రధానోపాధ్యాయురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఈసీఆర్ ఇంజంబాక్కం ప్రాంతానికి చెందిన సంగీత (40) ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తోంది. ఆమెకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. రెండు వారాల క్రితం ఆ పాఠశాలలో 22 ఏళ్ల యువతి ఉపాధ్యాయురాలిగా చేరింది. రెండు రోజుల క్రితం అర్ధవార్షిక పరీక్షల గురించి మాట్లాడాలని, ఆ మహిళా టీచర్‌ను హెచ్‌ఎం సంగీత తన ఇంటికి పిలిపించింది. ఆమె ఇంటికి వచ్చిన తర్వాత బెడ్‌రూంలో కూర్చొబెట్టి కూల్ డ్రింక్ అందజేసింది. అది తాగిన కొద్దిసేపటికే టీచర్ స్పృహ కోల్పోయింది. అనంతరం మెలుకువ వచ్చిన సమయంలో ఒంటిపై బట్టలు లేకపోవడం, శరీరంలో అక్కడక్కడా గాయాలుండడం గమనించింది. అక్కడ నుంచి తప్పించుకున్న ఆమె తిరువాన్మియూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం ప్రధానోపాధ్యాయురాలిని అరెస్ట్ చేశారు.

కుమార్తెపై లైంగిక వేధింపులు

కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన కామాంధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువారూర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 45 ఏళ్ల వ్యక్తికి వివాహమై 15 ఏళ్ల కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్తతో ఏర్పడిన విభేదాల కారణంగా భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని తన కన్నవారింట్లో ఉంటోంది. ఈ క్రమంలో, దీపావళికి కొత్త దుస్తులు, పుస్తకాలు, టపాకాయలు కొనుగోలుకు డబ్బులిస్తానని తండ్రి చెప్పడంతో, కుమార్తె, కుమారుడు ఇద్దరూ వెళ్లారు. ఆ సమయంలో కుమార్తెను ఆ వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. ఇంటికెళ్లిన కుమార్తె జరిగిన విషయాన్ని తల్లితో చెప్పడంతో ఆమె, నన్నిలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, కామాంధ తండ్రిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఉచిత బస్ టిక్కెట్టు లేకుండా ప్రయాణం

● మహిళకు రూ.200 జరిమానా

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సులో టిక్కెట్టు తీసుకోని మహిళకు అధికారులు రూ.200 జరిమానా విధించారు. తిరుప్పూర్-పులియంబట్టికి వెళ్లే టౌన్ బస్సు సోమవారం ఉదయం పల్లడంకు చేరుకుంది. అక్కడ బస్సెక్కిన ఓ మహిళ కండక్టర్ నుంచి ఉచిత ప్రయాణ టిక్కెట్టు తీసుకోలేదు. బస్సు బస్టాండ్‌కు చేరుకున్న సమయంలో అందులోని ప్రయాణికుల టిక్కెట్లను టిక్కెట్ కలెక్టర్లు పరిశీలించారు. అలాగే, సదరు మహిళను ప్రశ్నించగా, పురుషులున్న ప్రాంతంలో కండక్టర్ ఉండడంతో టిక్కెట్టు తీసుకొనేందుకు సాధ్యం కాలేదని బదులిచ్చింది. దీంతో, అధికారులు ఆమెకు రూ.200 జరిమానా విధించారు. కానీ, నా వద్ద నగదు లేదని మహిళ బదులివ్వడంతో, కండక్టర్ నెంబరుకు జీ పే ద్వారా జరిమానా చెల్లించాలని అధికారుల సూచనతో, ఆమెకు జీ పే ద్వారా జరిమానా చెల్లించి వెళ్లారు. ఈ విషయమై టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌వేల్ మాట్లాడుతూ... ప్రభుత్వ సాధారణ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళలు తప్పకుండా టిక్కెట్టు తీసుకోవాలన్నారు. టిక్కెట్టు తీసుకోకుండా ఆమె సెల్‌ఫోన్‌లో మాట్లాడుతన్నారని, బస్టాండ్‌లో దిగిన సమయంలో నిబంధనల మేరకు జరిమానా విధించామని తెలిపారు.

‘బ్రదర్’ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

● హీరో జయం రవి


జయం రవి, భూమిక, రాజేష్, నట్టి, వీటీవీ గణేష్ తదితరులు

ఎం.రాజేష్ దర్శకత్వంలో తాను హీరోగా నటించిన ‘బ్రదర్’.. క్లీన్ అండ్ డీసెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ అని ఆ చిత్ర హీరో జయం రవి వెల్లడించారు. స్క్రీన్ సీన్ మీడియా ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ విడుదల చేస్తున్నారు. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. ఇతర పాత్రల్లో భూమిక, నట్టి నటరాజ్, సుబ్రమణియన్, రావు రమేష్, అశ్వథ్ కుమార్, శరణ్య పొన్‌వణ్ణన్, సీత, సతీష్, కృష్ణన్, వీటీవీ గణేష్, ఎంఎస్ భాస్కర్, సురేష్ చక్రవర్తి తదితరులు నటించారు. చిత్రం విడుదలను పురస్కరించుకుని సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో హీరో జయం రవి మాట్లాడుతూ, ‘షూటింగ్ సమయంలో మేమంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయాం. నిర్మాత సుందర్ ఎలాంటి లోటు లేకుండా చూసుకున్నారు. నా సినిమాలకు మంచి హిట్ పాటలు ఇచ్చే సంగీత దర్శకుడు హరీస్ జయరాజ్, ఇందులో నా అభిమానుల కోసం డ్యాన్స్ చేశాను. ఇప్పటికే ‘మక్క మిషి’ పాట హిట్ అయింది. ఈ సినిమాలో అక్కా తమ్ముళ్ళ మధ్య ఓ ఎమోషనల్ సాంగ్ ఉంది. రిలీజ్ తర్వాత ఆ పాట హిట్ లిస్టులో చేరుతుంది. భూమిక నాకు అక్కగా నటించారు. వీటీవీ గణేష్ సినిమాలోనే కాదు సెట్స్‌లో ఉన్నా సందడే సందడి. ఈ సినిమాలో మరో కోణంలో ఆయన నటన ఉంటుంది. ‘బ్రదర్’ ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేయండి’ అని అన్నారు. దర్శకుడు ఎం.రాజేష్ మాట్లాడుతూ, ‘ఈ దీపావళి నేను దర్శకత్వం వహించిన చిత్రం విడుదల కావడం చాలా సంతోషంగా ఉంది. నేను దర్శకత్వం వహించిన చిత్రం థియేటర్‌లో విడుదలై మూడేళ్ళు అయింది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరు తమ అత్యుత్తమ నటన కనబరిచారు. సినిమా చూసిన తర్వాత సెన్సార్ సభ్యులు ఒక్క కట్ కూడా చెప్పకుండా క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఇది ఎంతో సంతోషాన్ని, బలాన్ని ఇచ్చింది’ అన్నారు. అలాగే, నటి భూమిక, ఇతర నటీనటులు ప్రసంగించారు.

చిత్రజ్యోతి

కలైంజర్.. రాజకీయ నేత కంటే ముందు

ఓ జర్నలిస్ట్

● మంత్రి మదివేందన్


టీఎంజేఏ దీపావళి సావనీర్ ఆవిష్కరణ దృశ్యం

తమ పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎం.కరుణానిధి రాజకీయ నేత కాకముందు ఒక పత్రికా విలేకరి అని అందుకే ఆయన సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందని ఆదిద్రావిడ సంక్షేమ శాఖామంత్రి ఎం.మదివేందన్ పేర్కొన్నారు. తమిళనాడు మూవీ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎంజేఏ) దీపావళి వేడుకలు సోమవారం రాత్రి నగరంలో జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి మదివేందన్‌తో పాటు యువ హీరో హరీశ్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎంజేఏ సభ్యులకు మంత్రి చేతుల మీదుగా దీపావళి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మంత్రి మదివేందన్ మాట్లాడుతూ, ‘ఈ వేడుకలకు నన్ను ఆహ్వానించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమానికి రావాలనే లక్ష్యంతో తీవ్ర పని ఒత్తిడి ఉన్నప్పటికీ హాజరయ్యాను. రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ సినిమాలను చూస్తుంటారు. జర్నలిస్టులపై తమకుగానీ, తమ పార్టీ పెద్దలకుగాని ప్రత్యేక ప్రేమ వుంది. ముఖ్యంగా దివంగత కలైంజర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టకుముందు ఒక పత్రికా విలేకరి. అందుకే ఆయన హయాంలోనే కాకుండా ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని ప్రభుత్వం కూడా జర్నలిస్టుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుంది. చిత్రపరిశ్రమకు కూడా ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ వేడుకకు హాజరైన హీరో హరీశ్ కళ్యాణ్‌కు పెళ్ళి రోజు శుభాకాంక్షలు. ఆయన హీరోగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలి’ అని అన్నారు. హరీశ్ కళ్యాణ్ మాట్లాడుతూ, ‘విలేకరుల చేతి రాతే మా తలరాత’గా మారిపోయింది. హీరోలుగా మంచి చిత్రాల్లో నటించినప్పటికీ.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళేది మాత్రమే సినిమా జర్నలిస్టులే’ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంజేఏ అధ్యక్షురాలు ఎస్.కవిత, ప్రధాన కార్యదర్శి కోడంగి అబ్రహాం, కోశాధికారి దురై శంకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, టీఎంజేఏ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో టీఎంజేఏ దీపావళి సావరీన్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించడంతో పాటు సినీ జర్నలిజంలో 50 యేళ్ళకుపైగా సేవలు అందించిన సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించి, ఆర్థిక సాయం చేశారు.


డబ్బింగ్ ప్రారంభోత్సవ దృశ్యం

‘విడాముయర్చి’ డబ్బింగ్ ప్రారంభం

అగ్రహీరో అజిత్ - మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతున్న ‘విడాముయర్చి’ చిత్రం డబ్బింగ్ సోమవారం చిన్న పూజా కార్యక్రమంతో ప్రారంభమయింది. ఇందులో దర్శకుడితో పాటు లైకా ప్రొడక్షన్ హెడ్ తిరుకుమరన్, నటుడు ఆరవ్, అజిత్ మేనేజర్ సురేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ డబ్బింగ్‌ను తొలుత నటుడు ఆరవ్‌తో ప్రారంభించగా, దీనికి సంబంధించిన ఫొటోలను మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, లైకా ప్రొడక్షన్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. ఇందులో త్రిష, అర్జున్, ఆరవ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫుల్‌లెంగ్త్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది.

నేత్రపర్వంగా నెల్లయప్పర్ కల్యాణోత్సవం


నెలయప్పర్- కాంతిమతి అమ్మవారికి దీపారాధన చేస్తున్న ప్రధానార్చకులు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాయన్మార్లంతా కీర్తించిన మహిమాన్విత శైవక్షేత్రం నెల్లయప్పర్ ఆలయంలో మంగళవారం నెల్లయప్పర్ - కాంతిమతి అమ్మవారి తిరుకల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తిరునల్వేలి నగరం నడిబొడ్డున ఉన్న ఈ ఆలయం వెయ్యేళ్లనాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయంలో ప్రతియేటా ఆణి మాసంలో జరిగే స్వామివారి మహారథోత్సవం, ఐప్పసి (ఆశ్వయుజ) మాసంలో నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవం ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. ఈ యేడాది ఐప్పసి తిరుకల్యాణోత్సవ వేడుకలు ఈ నెల 18న ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. గత పది రోజులుగా రోజూ ఉదయం, సాయంత్రం కాంతిమతి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం కంపానది మండపం వద్ద స్వామివారు అమ్మవారి ఎదుట ప్రత్యక్షమయ్యే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత మంగళవారం వేకువజాము బ్రహ్మముహూర్తంలో అమ్మవారి సన్నిధిలోని వేయికాళ్ల మండపంలో నెల్లయప్పర్ - కాంతిమతి తిరుకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నెల్లయప్పర్‌స్వామిని నెల్లై గోవిందరాజస్వామివారు కల్యాణ వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. తొలుత మూలవిరాట్టు కాంతిమతికి కంకణధారణ, అనంతరం మండపం వాకిట నెల్లయప్పర్‌కు పాదపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పుష్పమాలల మార్పిడి కార్యక్రమం జరిపారు. చివరకు భక్తులంతా నినాదాలు, మంగళవాయిద్యాల నడుమ ఆదిదంపతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలు తిలకించేందుకు తిరునల్వేలి జిల్లా నలుమూలల నుండే కాకుండా తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల నుండి కూడా భక్తుల తరలివచ్చారు. ఆలయ భక్తుల సమాఖ్య తరఫున భక్తులందరికీ విందు ఏర్పాటు చేశారు. ఆలయం తరఫున పొంగల్, కేసరి, ప్రసాద సంచులను భక్తులందరికీ పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఊంజల్ సేవలు ప్రారంభమయ్యాయి. గురువారం వరకూ ఈ ఊంజల్ సేవలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం స్వామి, అమ్మవార్లు వృషభవాహనంలో పట్టినప్రవేశం చేయనున్నారు.


‘శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్’లో మంగళవారం జరిగిన ‘వార్డ్ టెక్నీషియన్స్ గ్రాడ్యుయేషన్ డే’ సందర్భంగా ఓ అభ్యర్థికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ టాక్సికాలజీ సైంటిఫిక్ అండ్ అకడమిక్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎ.అమలన్ స్టాన్లీ


విమానంపై నీరు చల్లుతూ ఆహ్వానిస్తున్న దృశ్యం

లుఫ్తాన్సా కార్గో విమానానికి స్వాగతం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలంలోని విమానాశ్రయంలో లూఫ్తాన్సా కార్గో విమానానికి ఆహ్వానం పలికారు. లుఫ్తాన్సా కార్గో విమానం వారంలో రెండు రోజులు నగరం నుంచి నేరుగా ఐరోపాకు వెళ్లనుంది. ఈ విమాన సర్వీసుల కారణంగా వాణిజ్యపరమైన అభివృద్ధి, ఐరోపా దేశాల మధ్య కార్గో విమాన సమయం తగ్గడం తదితరాలు ఉపయోగకంగా ఉంటాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం


సముద్రం వెనక్కి వెళ్లడంతో బయల్పడిన బండరాళ్లు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ తీరంలో ఉన్న సముద్రం సుమారు 50 అడుగుల వెనక్కి వెళ్లింది. సునామీ సంభవించిన అనంతరం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో నిర్ణీత సమయంలో సముద్రం వెనక్కి వెళ్లడం జరుగుతోంది. కానీ, అమావాస్య ఇంకా మూడు రోజులుండగా మంగళవారం సముద్రం వెనక్కి వెళ్లడంతో జాలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రం వెనక్కి వెళ్లడంతో నాళికినరు నుంచి అయ్యా ఆలయం వరకు సుమారు 200 మీటర్ల మేర సముద్ర తీరం వరకు పాచిబట్టిన బండరాళ్లు కనిపించాయి. ప్రజలు ఈ బండరాళ్ల వద్ద సెల్ఫీ తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సముద్రం యథాస్థితికి చేరుకోవడంతో భక్తులు, జాలర్లు ఊపిరి పీల్చుకున్నారు.

ముందస్తు పరీక్షలతోనే పక్షవాతం దూరం

● మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్



సిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దినేష్ కార్తీక్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చక్కటి ఆహార అలవాట్లు, రోజూ తగినంత వ్యాయామం చేయడంతోపాటు వయస్సు పెరుగుతున్న కొద్దీ ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుంటే పక్షవాతానికి దూరంగా ఉండి, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని భారత మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్ అన్నారు. స్థానిక వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో ప్రపంచ పక్షవాత నిరోధక దినం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో పక్షవాతానికి గురై సిమ్స్ హాస్పిటల్‌లో చికిత్సలందుకుని కోలుకున్న మహిళా పాత్రికేయురాలు జస్విని తన అనుభవాలను వివరించారు. సిమ్స్ న్యూరోసైన్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్‌బాపు మాట్లాడుతూ మద్యం, ధూమపానం వంటి దురలవాట్లు, మధుమేహం, ఊబకాయం, వేళాపాళ లేని ఆహారఅలవాట్లు, రక్తపీడనం ఉంటే పక్షవాతానికి గురయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రస్తుతం పక్షవాతాన్ని నయం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సిమ్స్ వైస్ ప్రెసిడెంట్ రాజు శివసామి మాట్లాడుతూ ‘స్ట్రైక్ అగైనెస్ట్ స్ట్రోక్’ నినాదంతో తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. సిమ్స్ సీఈఓ విజయశంకరన్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రుల్లో పక్షవాతానికి మెరుగైన చికిత్స

● డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం



పక్షవాతం నుంచి కోలుకున్నవారితో డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం, వైద్యనిపుణులు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రుల్లో పక్షవాతానికి గురయ్యే రోగులకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన వైద్యం అందించడానికి అత్యాధునిక సాంకేతిక పరికరాల వ్యవస్థ ఉందని ఆ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జెన్ డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం తెలిపారు. పక్షవాతానికి గురైన 4.5 గంటల్లోగా చికిత్సలందిస్తే రోగి సులువుగా కోలుకుంటాడని, సీటీ, ఎంఆర్ఐ స్కాన్ వంటి సదుపాయాల కాకుండా త్రాంబోలిసినస్, త్రోంబాక్టమీ చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నగరంలో ప్రపంచ పక్షవాత నిరోధక దినం సందర్భంగా ఆ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న రోగులను మీడియా సమావేశంలో పరిచయం చేశారు. ఆ రోగులంతా తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీనాయర్, డాక్టర్ సతీష్‌కుమార్ వెంకటసామి, డాక్టర్ ఎస్ కార్తికేయన్, డాక్టర్ వీఎల్ అరుళ్‌సెల్వం, డాక్టర్ పీఆర్ ప్రభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఏక్తా దివస్’


ఏక్తా దివస్ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్, కామరాజర్ పోర్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ‘రాష్ట్రీయ ఏక్తా దివస్’ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోర్టుల ఉన్నతాధికారులు, ఉద్యోగులు కలిసి ‘రన్ ఫర్ యూనిటీ - ఏక్తా రన్’ పేరుతో నిర్వహించిన వాక్‌థాన్‌ను పద్మశ్రీ ఆచంట శరత్ కమల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్మన్ సునీల్ పలివాల్, డిప్యూటీ ఛైర్మన్ ఎస్.విశ్వనాథన్, కామరాజర్ పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ జేపీ ఐరెన్ సింథియా తదితరులు కూడా పాల్గొన్నారు.

వైభవంగా ధన్వంతరి హోమం


హోమపూజల్లో నిర్వాహకులు

వేళచ్చేరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గీతా భవన్ ట్రస్ట్, ఆరోగ్య భారతి-తమిళనాడు సంయుక్త ఆధ్వర్యంలో ద్వితీయ వార్షిక ధన్వంతరి జయంతి వైభవంగా జరిగింది. గోపాలపురంలోని గీతా భవన్ హాలులో మంగళవారం ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ హోమాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా పాల్గొని ధన్వంతరికి ప్రత్యేక పూజలు చేశారు. గీతా భవన్ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్, ట్రస్టీలు పూజ గోయల్, కేకే గుప్తా, మనోహర్ పగాడియా, మురారిలాల్, ఆరోగ్య భారతి తమిళనాడు నిర్వాహకులు డా.హరిహరన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



చెన్నై సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కొత్త భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యుద్దీప కాంతుల్లో ధగధగలాడుతున్న చెన్నై వేళచ్చేరిలో వున్న ఫీనిక్స్ మాల్



మంగళవారం తిరుచ్చిలోని భారతీదాసన్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



నడకదారిలో ఈసుర్లు

అలిపిరి నడకమార్గంలో మంగళవారం రాత్రి భారీగా ఈసుర్లు వచ్చాయి. మోకాళ్లమిట్టకు సమీపంలో లైట్ల చుట్టూ భారీగా చేరాయి. దీంతో నడక దారిన వెళుతున్న భక్తులు ఇబ్బంది పడ్డారు. చెవులు, కళ్లల్లో పడతామోనని భయంతో నడకమార్గంలో కాకుండా రోడ్డుపైనే నడిచారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి









వెరైటీగా..

వివిధ ఆకృతులు, దేవతామూర్తుల బొమ్మలతో, చూడగానే ఆకర్షించేలా మట్టి ప్రమిదలు వచ్చాయి. దీపావళి సందర్భంగా ఇలాంటి వెరైటీ ప్రమిదలను తిరుపతిలో విక్రయిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములుకండి

- శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మంత్రి భరత్ పిలుపు

శ్రీసిటీ, అక్టోబరు 29: నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంలో భాగస్వాములు కావాలంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పరిశ్రమల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్‌తో కలిసి మంత్రి మంగళవారం శ్రీసిటీలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఇక్కడి పరిశ్రమల సీఈవోలు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానం 4.0ను వారికి వివరించారు.



శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి

సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... నూతన పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ఈ విధానంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి, పర్యావరణ హరిత శక్తి, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. సుస్థిర పారిశ్రామికాభివృద్ధిని పెపొందించుకుంటూ ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. సమావేశానికి హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు నూతన పారిశ్రామిక విధానాన్ని హర్షించారు. ముఖ్యంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఉదేదశించిన ప్రోత్సహకాలను అభినందిస్తూ, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సహకాలను ప్రభుత్వం త్వరగా రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకనుగుణంగా వృత్తి, శిక్షణ కార్యక్రమాలలో పెట్టుబడులను పెంచాలని సూచించారు. శ్రీసిటీలో పారిశ్రామికవర్గానికి నూతన పారిశ్రామిక విధానం, దాని ముఖ్య అంశాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినందుకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా వరకుమార్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ల్యాండ్ ప్రొటక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా వరకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని కేఆర్‌ఆర్‌సీ విభాగంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా ఉన్న రామ్‌మోహన్ తిరుపతి ఆర్డీవోగా బదిలీపై వెళ్లారు. అయితే జిల్లా ప్రొటోకాల్, వీసీఐసీ, జీఎస్ఎస్ఎస్ వంటి పోస్టులకు ఇంకా ఎవరినీ నియమించలేదు.

వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్ర సమర్పణ



చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండోవ రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ, కొలువు పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రాశనాయనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనే, చందనం, కొబ్బరినీళ్ళతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, అనంభట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు నారాయణాచార్యులు, జమేధర్ చిరంజీవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం!

- తిరుపతి జిల్లా వైసీపీ కార్యకర్త మృతిపై హైకోర్టు ఆదేశం
- ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ తీయించాలని నిర్దేశం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, వడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించి, ఆ నివేదికను తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ఆస్పత్రి వైద్యుల బృందంతో రీపోస్టుమార్టం చేయించాలని, ఆ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయించాలని, మృతుడి భార్య, రక్తసంబంధీకులను మాత్రమే లోనికి అనుమతించాలని ఆ జిల్లా ఎస్పీ, పెళ్లకూరు ఠాణా సీఐలకు సూచించింది. ఈ వ్యవహారంలో ఇతరులు ఎవరూ జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని నిర్దేశించింది. తన భర్త మృతిపట్ల అనుమానాలున్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని స్వయంగా మృతుడి భార్య కోరుతున్నందున నివృత్తి చేసేందుకే ఈ ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. రీపోస్టుమార్టం నిర్వహణ వల్ల ఎవరికీ అన్యాయం జరగబోదని, అనుమానాలు తొలగిపోతాయని తెలిపింది. విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ చెంచయ్య భార్య ప్రమీలమ్మ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తన భర్తను ప్రత్యర్థులు హత్య చేశారని, చెట్టుకు ఉరివేసుకొని మరణించినట్లు చిత్రీకరించారని ప్రమీలమ్మ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చెంచయ్యను ప్రత్యర్థులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. మృతుడి ఒంటిపై యాసిడ్ గాయాలు ఉన్నాయని తెలిపారు. వాస్తవాలను వెలికితీసేందుకు స్విమ్స్ వైద్యబృందం తో రీపోస్టుమార్టం చేయించాలని కోరారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. గ్రామంలో రెండు వర్గాలున్నాయని, ఘటనకు రెండు రోజుల ముందు ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందని తెలిపారు. చెంచయ్య మరణాన్ని రాజకీయంగా వాడుకొనేందుకు ప్రయత్నించారని, మొదట పరిశీలించినప్పుడు మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని పేర్కొన్నారు. ఏ కారణంతో మృతిచెందారో తెలియాలంటే పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బాలల కమిషన్ చైర్మన్ అప్పారావు

బాలలపట్ల నేరాలను కట్టడి చేయాలి

- సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి
- ఏపీ ఎస్‌సీపీసీఆర్ చైర్మన్ అప్పారావు

తిరుపతి విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న నేరాలను కట్టడి చేయడానికి ఆయా శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని బాలల హక్కుల కమిషన్ (ఏపీ ఎస్‌సీపీసీఆర్) చైర్మన్ అప్పారావు పిలుపునిచ్చారు. బాలల హక్కుల కమిషన్ నేతృత్వంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ (సీఐఎఫ్) ఆధ్వర్యంలో బాలలపట్ల జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, వేధింపులు, సైబర్ నేరాలపై తిరుపతిలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా బాలలను లక్ష్యంగా చేసుకుని అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయన్నారు. అనేక సైబర్ నేరాలతోపాటు కొందరు బాలలైతే ఏకంగా సెక్సువల్ దోపిడీకి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొందరు బాలలను మభ్యపెట్టి, భయపెట్టి గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటుచేసి వారిని రవాణాకు కూడా వినియోగించుకుంటున్నారంటూ ఇటీవల వెలుగుచూసిన కొన్ని సంఘటనలతో వివరించారు. వీటన్నింటినీ అరికట్టాలంటే బాలలందరికీ సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించాలన్నారు. కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బాలలపై సైబర్ నేరాలు నిత్యకృత్యమైపోయాయన్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి భయపెట్టడం, బెదిరించడం లాంటివి నిత్యం వినాల్సి వస్తోందన్నారు. వీటిని తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు సోషల్ మీడియాపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని, పటిష్టమైన పాస్‌వర్డ్ పెట్టుకోవాలన్నారు. ఆడపిల్లలు తమ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టొద్దని సూచించారు. మొబైల్, ట్యాబ్‌లతో తమ పని అయిపోగానే నెట్ ఆఫ్ చేసేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలు, బెదిరింపులకు గురైతే భయపడకుండా టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదుచేస్తే తక్షణం తగిన రక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఎఫ్ మేనేజర్ గౌరి, కోఆర్డినేటర్ కొడప్ప, సభ్యులు సుబ్రతకుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తమీమ్ అహ్మద్, రాయలసీమ, నెల్లూరు జిల్లాల బాలల సంక్షేమ సమితి అధ్యక్షులు, మిషన్ వాత్సల్య అధికారులు అధికారులు, జిల్లా సైబర్ నేరాల పర్యవేక్షణ పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలంలోని మంగళం ట్రెండ్స్ పాఠశాల మైదానంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బేస్‌బాల్ అండర్ 14, 17 విభాగాల మధ్య పోటీలు నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 208 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను (అండర్ 14, 17 విభాగాలకు 16మంది చొప్పున) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేశవుల నాయుడు క్రీడాకారులను అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 9, 10, 11 తేదీల్లో మంగళం ట్రెండ్స్ పాఠశాలలో జరిగే అండర్ 14 విభాగం, గుంటూరు జిల్లా యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే అండర్ 17 విభాగం పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.బాబు, కృష్ణ, నూరుద్దీన్, ఎస్.ఎస్.నాయుడు, సురేష్, జయశంకర్, రామకృష్ణ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచీ ఎస్వీయూలో యువ తరంగ్

- పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి అనగాని



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో నవంబరు 8వ తేది నుంచి యువ తరంగ్-2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని వర్సిటీ కల్చరల్ అఫైర్స్ విభాగం నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం ఆవిష్కరించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి యూరప్‌లో శ్రీనివాస కల్యాణాలు

తిరుమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో యూకే, ఐర్లాండ్, యూరప్‌ల్లో ఎనిమిది దేశాల్లోని 13 నగరాల్లో శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీలు మంగళవారం టీటీడీ ఈవో శ్యామలరావును తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. టీటీడీ సహకారంతో స్థానిక స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలతో కలిసి నవంబరు 9 నుంచి డిసెంబరు 21 వరకు ఏపీ ఎన్ఆర్‌టీ శ్రీనివాస కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఈవోకు తెలిపారు. ఈ తిరు కల్యాణ కార్యక్రమాల్లో టీటీడీ వేదపండితులు వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించనున్నారు. నవంబరు9న బెల్ఫాస్ట్(ఐర్లాండ్), 10న డబ్లిన్(ఐర్లాండ్), యూకేలో 16న బేసింగ్‌స్టోక్(యూకే), 17న ఐండోహోవెన్(నెదర్లాండ్స్), 23న హంబర్గ్(జర్మనీ), 24న పారిస్(ఫ్రాన్స్), 30న వార్సా(పోలాండ్), డిసెంబరు1న స్టాక్‌హోం(స్వీడన్), 7న మిల్టన్‌కీన్స్(యూకే), 8న గ్లౌసెస్టర్(యూకే), 14న ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ), 15న బెర్లిన్(జర్మనీ), 21న జ్యూరిచ్(స్విట్జర్లాండ్)లో కల్యాణం నిర్వహించనున్నారు.



కల్యాణం వివరాల క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు,సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీ

భక్తులకు టీటీడీ ఈవో దీపావళి శుభాకాంక్షలు

శ్రీవారి భక్తులకు టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఏమార్చి.. నగలు కాజేసి!

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ.3.6 లక్షల విలువైన బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఏమార్చి, బ్యాగుల్లోని బంగారు నగలు, సెల్‌ఫోన్లు అపహరించే ఇద్దరు నిందితులను తిరుపతి క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడ మండలానికి చెందిన వేముల శివకుమార్ వృత్తిరీత్యా తిరుపతి రూరల్ మండలం తనపల్లి వద్ద ఉంటున్నాడు. ఇతడితో పాటు వేములపల్లి దుర్గ ఉంటోంది. ఈజీ మనీ కోసం వీరు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వారి సహచరులు దుర్గాప్రసాద్, జగదీష్‌తో కలసి గుడివాడ, భీమవరం, ఆకివీడు, నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో 30కి పైగా ఇంటి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చారు. ఇందులో దుర్గ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల వద్ద విలువైన బంగారు నగలు, సెల్‌ఫోన్లను వారి బ్యాగుల నుంచి దొంగిలించి పారిపోవడంలో ఆరితేరిన వారుగా పోలీసులు గుర్తించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో దర్యాప్తు జరిపిన క్రైం పోలీసులు వీరికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం అలిపిరి బస్టాండు వద్ద ఇద్దరు నిందితులు ఉండగా క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.60 లక్షల విలువైన బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు.

1 నుంచి ఏపీఆర్‌సెట్ రెండో దశ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) రెండో దశ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 2,566 సీట్లకుగాను, తొలి దశలో 2005 సీట్లు భర్తీ చేశారు. మిగిలిన సీట్లను రెండో దశలో భర్తీ చేయనున్నారు. సమగ్ర సమాచారం కోసం.. సెట్స్‌ఏపీసీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్ చూడాలని ఏపీఆర్‌సెట్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

ఎస్వీబీసీకి రూ.54.47 లక్షల విరాళం

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ (శ్రీవేంకటేశ్వర భక్తి చానల్) ట్రస్టుకు మంగళవారం రూ.54.47 లక్షలు విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఎండీ మణిమేఖలై ఈ విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈమొత్తాన్ని ఎస్వీబీసీ ట్రస్టుకు వినియోగించాలని కోరారు. జోనల్ హెడ్ భాస్కర్‌రావు, రిజినల్ హెడ్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న మణిమేఖలై